


ప్రజాజ్యోతి
ఖమ్మం
బుధవారం 6-3-2024 పేజీలు : 6




## బౌద్ధ స్థూపాన్ని ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా అభివృద్ధి పరచాలి

**మంత్రి పొంగులేటి**

**ఖమ్మం ప్రతినిధి మార్చి 5 ప్రజా జ్యోతి**
బౌద్ధ స్థూపం ప్రపంచ దృష్టికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి నేలకొండపల్లి లోని బౌద్ధ స్థూపాన్ని, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తో కలిసి సందర్శించారు. బౌద్ధ స్థూపాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. 8 ఎకరాల్లో ఉన్న ప్రాంతంలో ఎక్కడ ఏ విధమైన పనులు చేయాలో కార్యాచరణ చేయాలన్నారు. స్థూపం ప్రాంతంలోని జంగిల్ తొలగించి, శుభ్రం చేయాలన్నారు. స్థూపం మార్గం చూపిస్తూ, మంచి డిజైన్ తో బోర్డులు అన్ని దిక్కులలో ప్రదర్శించాలన్నారు. గార్డెనింగ్ చేపట్టి, దాని నిర్వహణ విషయమై చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువు అభివృద్ధి కి చర్యలు చేపట్టాలన్నారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విడిది కేంద్ర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్థూపం పరిసరాల్లో ఎక్స్ప్లోజన్ పనులు చేపట్టి, చారిత్రక ఆనవాళ్లు ప్రజలకు తెలియజెప్పాలన్నారు. స్థూపం అభివృద్ధి కి సేకరించిన 4 ఎకరాల భూమి విషయమై రికార్డుల పరిశీలన చేసి, తగుచర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాలలో బౌద్ధ స్థూపం ప్రాశస్త్యం ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ ఏడి నర్సింగ్ నాయక్, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో తాగునీటి పెద్దడిని దృష్టిలో ఉంచుకొని

## ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి మార్చి,05 ప్రజా జ్యోతి :**
వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు ప్రణాళికతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్‌తో కలిసి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలపై రెవెన్యూ, ఇర్రిగేషన్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరుల లభ్యత వినియోగంపై సంబంధిత శాఖల సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో పర్యవేక్షణ చేయాలన్నారు. పాలేరు, వైరా, లకారం, లంకపల్లి జలాశాయాలలో లభ్యత, వచ్చే నాలుగు నెలలకు సరిపడా కావాల్సిన నీటి లభ్యతకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.బేతుపల్లి, బోడేపూడి సుజలాంసఫలం, భగీరథ ఎన్ఎస్పి ద్వారా నీటిని సమకూర్చుకుంటే భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో గ్రావిటీ పెరుగుతుందని తద్వారా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి కొరతను అదిగమించవచ్చన్నారు. మిషన్ భగీరథతో పాటు ఇతర నీటి లభ్యతకు చర్యలు చేపట్టాలన్నారు. 50 శాతం గ్రౌండ్ వాటర్‌ను సమకూర్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ గౌరవ మంత్రివర్యుల సూచనల ప్రకారం నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని, తాగునీటి లభ్యత, వినియోగంపై సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. దనావాయి గూడెంలో ఫిల్టర్ బెడ్స్‌తో పాటు లకారంలో 5 ఎంల్‌డి ఫిల్టర్ బెడ్స్ ద్వారా నగరంలో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ ద్వారా రోజువారి వినయోగంకు కావాల్సిన నీటి లభ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, జలాశయాలతో పాటు గ్రామాలలో ఉన్న బోర్లను పునరుద్దరించడం జరిగిందని, రోజువారి వినియోగంకు .013 టిఎంసీ అవసరమవుతుందని ఏప్రిల్ 1 నాటికి 1 టింఎసి నీటిని సమకూర్చుకున్నట్లయితే వచ్చే నాలుగు నెలల వరకు సప్లయి చేసేందుకు ఇబ్బందులుండవన్నారు. కార్పోరేషన్ పరిధిలో 33 ఎంఎల్‌డి సప్లయి చేసే వారమని, మరో 5 ఎంఎల్‌డి పెంచడం జరిగిందని, ఇప్పటి వరకు 4 మోటార్లు రన్నవుతున్నాయని మరో మోటారును కూడా సిద్దం చేయడం జరిగిందని 5 మోటార్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇర్రిగేషన్ శాఖ అధికారులు వివరించారు. పోలీసు కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్‌లు మయాంక్‌సింగ్, యువరాజ్, ట్రాన్స్‌కో ఎస్.ఈ సురేందర్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఆనంద్‌కుమార్ మిషన్ ఎస్.సదాశివకుమార్, భగీరథ ఇంట్రా ఇ.ఇ పుష్పలత, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావుని

## పరామర్శించిన రేణుక చౌదరి

కొణిజర్ల మార్చి 5 ప్రజా జ్యోతి
ఇటీవల కొణిజర్ల మండల పరిధిలోని హత్య ప్రయత్నానికి గురై న కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు . ఏ ఐ జి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ ఎల్ డి ఎం కన్వీనర్ సూరంపల్లి రామారావు పరామర్శించిన రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి. ఈ దాడి ఎలా జరిగింది అనేదానిపై సమాచారం తెలుసుకున్నారు. మెరుగైనవైద్యచికిత్స అందిచాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరారు.



### మిర్చి మార్కెట్లో మధ్య దళారీ దోపిడీని అరికట్టాలని

# ఖమ్మం లో మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయం ముట్టడి

### సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కె ఎం ఎస్) జిల్లా కమిటీల డిమాండ్

**ఖమ్మం మార్చి 5 ప్రజా జ్యోతి**

ఖమ్మం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాల యాన్ని ముట్టడిస్తున్న సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ,అఖిల భారత రైతుకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించటం జరిగింది ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిందని జిల్లాలో రైతులు తిరగబడితే బేడీలు వేసి జైలుకు పంపిన చరిత్ర గత ప్రభుత్వానికి ఉన్నదని అదే తరహాలో కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేక కార్యక్రమాల చేయవద్దని రైతులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని వారు కోరారు అదేవిధంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ నాయకులు అవునూరి మధు మాట్లాడుతూ అఖిల భారత స్థాయిలో రైతాంగ ఉద్యమాలు ఒకపక్క జరుగుతా ఉన్నాయి ఎంఎస్పీ చట్టం తేవాలని రైతాంగా నికి మద్దతు ధర కనీసం చింతాకు 30వెలు రూపాయలు నిర్ణయించాలని వారు అన్నారు. అఖిలభారత రైతుకులి సంఘం రాష్ట్ర నాయకులు డేవిడ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత వాగ్దానాలను అమలు చేయాలని రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీని తక్షణమే చేసి బ్యాంకుల ద్వారా కొత్త రుణాలను అందించాలని వారు అన్నారు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాల్లో రైతులు పండించిన పంటను ఖమ్మం మార్కెట్లోకి తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు మార్కెట్లో ఉన్న వ్యాపారులు రైతులను నిలువునా దోపిడీ చేస్తూ మార్కెట్ మాయాజాలంతో రైతులు విలవిల కొట్టుకుంటున్నారు




కింటామిర్చికి జెండా పాట 22 వెలు పాడితే అలా కొనకుండా దాన్ని 14 నుండి 16 వేల రూపాయలకు ఖరీదు చేస్తున్నారని రైతులుఅడిగితే వారి అతి తెలివిని చూపి రైతులను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని నియమ నిబంధనలు లేకుండా ఈ ప్రభుత్వాలు రైతులతో చెలగాటం ఆడుతున్నారు అని వారు అన్నారు ఖమ్మం మార్కెట్లో జరుగుతున్న మధ్య దళారుల రూపంలో విచ్చలవిడిగా మాఫియా జరుగుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బద్దూరి వెంకటరామిరెడ్డి వై ప్రకాష్ ప్రజల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ జిల్లా కార్యదర్శి వై జానకి జిల్లా నాయకులు ఐ వెంకన్న,జి రమేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమో ఖమ్మం నగర కార్యదర్శి పాముల మోహన్ రావు, ఎస్ కె సుభహాన్, శ్రీకాంత్, షబ్బీర్ ,ప్రసాద్,శ్రీనివాస రెడ్డి పేర %శీ% వెంకటేశ్వర్లు ఎల్లయ్య, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ సర్వేందర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాంనారాయణను పరామర్శించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం మార్చి 5 ప్రజాజ్యోతి :**

టియుడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారా యణను రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మంగళవారం రాపర్తి నగర్లోని రాంనారాయణ ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాంనారాయణ ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం విధితమే. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పొంగులేటితో పాటు పలువురు జర్నలిస్టులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాంనారాయణ సమాచార శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి దృష్టికి తీసుకు వచ్చారు. హెల్త్ కార్డులు లేక క్యాన్సర్ వైద్యం అందక జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో చెల్లుబాటయ్యేవిధంగా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. అలాగే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య ప్రధానమైందని ఇండ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరగా స్పందించిన మంత్రి పొంగులేటి హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. పొంగులేటి వెంట కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంఎల్ఏసి బాలసాని లక్ష్మి నారాయణ, రాయల నాగేశ్వరావు, మువ్వా విజయబాబు, బొర్రా రాజశేఖర్ ,స్వర్ణకుమారి, టియుడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఖదీర్, గోగి రెడ్డి శ్రీనివాస్,ఎలక్ట్రానిక్



మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవుల శ్రీనివాస్, కనకం సైదులు, టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ,ఐజెయు జిల్లా కోశాధికారి శివానంద, జిల్లా నాయ కులు నలజాల వెంకట్రావు, మోహినుద్దీన్, ఎం. పాపారావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

**నగర మేయర్ పరామర్శ.**

ఖమ్మం నగర మేయర్ పునుకోలు నీరజ రామబ్రహ్మం తో పాటు సిపిఎం జిల్లా ఇన్చార్జి కార్యదర్శి ఎర్ర శ్రీకాంత్, వై విక్రమ్, రమేష్, భద్రాది కొత్తగూడెం జిల్లా టి యు డబ్ల్యు జె ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం ఆనంద్, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ పిల్లి రాజు తో పాటు కరీంనగర్ జిల్లా చెందిన ఐజేయు నాయకులు కూడా రాంనారాయణ ను పరామర్శించారు

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేతలను అభినందించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం మార్చి 5 ప్రజా జ్యోతి.

నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ లో ఇటీవల 70వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 34 పురుషుల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ఖమ్మం జిల్లా పురుషుల జట్టు



3వ స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో విజయం సాధించిన క్రీడాకారులను, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రిష్టఫర్ బాబును మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ హయాంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# ధరణి సమస్యలు పరిష్కరించండి

### రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు



**కొణిజర్ల మార్చి 05 ప్రజాజ్యోతి**

రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలు సంపూర్ణంగా పరిష్కారం చేయాలి అని అందుకు రైతు సంఘాల ప్రతినిధులు రైతులతో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విస్తృత చర్చ జరిపి సమగ్ర విధానం రూపొందించాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామం లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలు పై సర్వే నిర్వహించారు . ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిశీలన చేయుటకు బృందాలు ఏర్పాటు చేసింది అని . గత ప్రభుత్వం పరిపాలనలో సాగు భూములు పట్టాదారు పాస్ పుస్తకాలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయుటకు కూడా కొన్ని సమస్యలు కు అవకాశం ఇవ్వలేదని. సాధా బైనం దరఖాస్తులు పరిశీలన చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని . కేసిఆర్ ప్రభుత్వం ధరణి నిబంధనలు వలన తర తరాలుగా సాగు లో ఉన్న రైతులకు నష్టం వాటిల్లింది అని అన్నారు. భూ రికార్డు లలో అనుభవకాలం పునరుద్ధన చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో గ్రామ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విస్తృత సంప్రదింపులు జరిపి ధరణి సమస్యలు పరిష్కారం కోసం సమగ్ర విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, మండల నాయకులు దొడ్డపనేని కృష్ణరజన్ రావు , మిద్దె రామారావు ,రాచ్చబంట్టి రామయ్య, అనుమోలు వెంకటేశ్వరరావు, ఖాసిం బేగ్ ఎస్ ,కె అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రామ కృష్ణ సేవా సమితి విహే ( వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ) ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్మెంట్



**ఖమ్మం మార్చి 5 ప్రజాజ్యోతి :**

శ్రీ రామకృష్ణ సేవాసమితి %ఉ% వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య మరియు విజయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇన్స్పైర్ అనే పేరుతో యూత్ ఎంపవర్మెంట్ కార్యక్రమం నిర్వహించారు. విజయ ఇంజనీరింగ్ కాలేజ్లోనూ నిర్వహించగా, హైద్రాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు శ్రీమత్ స్వామి బోధమయానంద ముఖ్యవక్త గా ప్రసంగిస్తూ విద్యార్థులకు , జీవనవిలువలు, దేశభక్తి , ఆత్మ శ్రద్ధ ఆవశ్యకతను వివరించారు. అద్భుతంగా ఉత్తేజకరంగా సాగిన స్వామిజీ ఉపన్యాసాలు విద్యార్థులకు ప్రేరణగా నిలిచాయి. వివేకానంద స్వామి జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకుని యువత శీల నిర్మాణంచేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో సేవా సమితి బాధ్యులు పరాశరం ప్రసాద్ , డా రాంకిషన్ రావు , కె ఎస్ పి రాయ్ , ఉమాకార్ , విహే ఫౌండర్ దేవకి వాసుదేవ రావు , రామిరెడ్డి పాల్గొన్నారు . %ూజు%% ప్రిన్సిపాల్ కృష్ణ మూర్తి , సుదర్శన్, విజయ ఈసీ ప్రిన్సిపాల్ జాన్ బాబ్ , స్టాఫ్ స్వామిని సత్కరించారు. మొత్తం 800 విద్యార్థులు ఈ కార్యక్రమంలో స్ఫూర్తి పొందారు

## పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఎంపీలు వద్దిరాజు,మాలోతు పసునూరి,మాజీ ఎంపీ సీతారాం నాయక్ భేటీ



**ఖమ్మం మార్చిలేదు ప్రజా జ్యోతి.**
బీఆర్ఎస్ మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గ అభ్యర్థి మాలోతు కవితకు ఘన విజయం చేకూర్చేందుకు గాను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు పసునూరి దయాకర్,మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ లు భేటీ అయ్యారు.హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ రవిచంద్ర నివాసంలో కవిత, దయాకర్,నాయక్ లు ఆయనతో సమావేశమై బీఆర్ఎస్ ఘన విజయమే లక్ష్యంగా, ధ్యేయంగా, అంకితభావంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ విషయమై సుదీర్ఘంగా చర్చించారు,వ్యూహారచన చేశారు.లోకసభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్,నోటిఫికేషన్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో వారు సమాలోచనలు జరిపారు.పార్టీ ప్రముఖుల పర్యటనలు, నాయకుల్ని సమన్వయం పర్చడం,సభలు, సమావేశాల తేదీల ఖరారు,ప్రచారసరళి, కార్యకర్తలకు దిశానిర్దేశం,ప్రజలతో నేరుగా మమేకమవ్వడం, ఎజెండా, సంబంధిత అంశాలపై ఎంపీ రవిచంద్ర, కవిత, దయాకర్,మాజీ ఎంపీ సీతారాం నాయక్ లు సమాలోచన చేశారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ విపి గౌతమ్



**ముదిగొండ మార్చి 05(ప్రజా జ్యోతి)**
ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ మంగళవారం సందర్శించారు.ఈసందర్భంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తరగతి గదులను ఆయన పరిశీలించారు.విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి మధ్యలో బయటికి వెళ్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ గౌతమ్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపర్డెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్ ను ఆరా తియ్యగా ఒకేషన్ కోర్స్ విద్యార్థిని,విద్యార్థులకు ఒక గంట పాటు ఓఏ (ఆఫీస్ అసిస్టెంట్ షిప్) షార్ట్ హ్యాండ్ డ్రిల్లింగ్ ప్రేయర్ కు అవకాశం ఇస్తామని కలెక్టర్ కు అయన చెప్పారు.చీఫ్ సూపర్డెంట్ గది లో సిసిటివితోపాటు,ప్రశ్నపత్రాలనుభద్రం పరిచే అల్మర,ప్రశ్నాపత్రాలు అకౌంట్ తనిఖీ చేశారు.మాస్ కాపీయింగ్ జరక్కుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.ప్రశ్నాపత్రాలను కారులో పోలీస్ ఎస్కార్ట్ తోనే తీసుకొస్తున్నారా. లేదని గేటు దగ్గర ఉన్న పోలీస్ కానిస్టేబుల్ను కలెక్టర్ విపి గౌతమ్ అడిగి తెలుసుకున్నారు.పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల దగ్గర నుండి మొబైల్ ఫోన్స్ ను గేటు వద్ద సెక్యూరిటీగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ దగ్గరనే ఉన్న విషయాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ దృష్టి సారించారు.కళాశాల గ్రౌండ్లో ఆట స్థలాన్నికి నిధులు మంజూరు చేయమని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ కోరగా కలెక్టర్ మంజూరు చేస్తానని,ప్రపోజల్ పంపించమని కలెక్టర్ చెప్పారని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, తెలిపారు.

## తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు : జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి మార్చి,05 ప్రజాజ్యోతి :** తీర్థాల, స్నానాల లక్ష్మీపురం, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయం, స్నానాల లక్ష్మీపురం జాతర ఏర్పాట్లపై దేవాదయ, రెవెన్యూ, విద్యుత్, ఇర్రిగేషన్, పంచాయితీ, ఆర్.టి.సి, మత్స్యశాఖ, ఫైర్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 8 నుండిజరిగే తీర్థాల, స్నానాల లక్ష్మీపురం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం క్యూలైన్లు, లైటింగ్, పారిశుద్ధ్య పరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ శివారులో పార్కింగ్,మిషన్ భగీరథ ద్వారా సురక్షిత త్రాగునీరు అందించాల న్నారు. స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ సహాయ



కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఎస్ఈ ట్రాన్స్కో సురేందర్, సీ.ఈ.ఓ జడ్పీ వినోద్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్య శాఖ ఏడి ఆంజనేయ స్వామి, దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి డిగ్రీ కళాశాలను రాష్ట్రంలోనే మోడల్ కళాశాలగా తీర్చిదిద్దాలి : మంత్రి పొంగులేటి



**కొండపల్లి మార్చి 5 ప్రజాజ్యోతి :** రాష్ట్రంలోనే మోడల్ కళాశాలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి నేలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ (మోడల్) డిగ్రీ కళాశాలలో రూ. 12 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు వసతులు, వసతి గృహాల సముదాయానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. కళాశాల పరిశీలన తర్వాత రాష్ట్రంలో ఈ తరహా 3 కళాశాలలు ఉన్నట్లు, అందులో మన కళాశాల ఒకటని అన్నారు. త్వరలోనే సాంకేతిక కోర్సులు వచ్చేట్లు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి కావాల్సిన నిధులు మంజూరు చేసి, రోల్ మోడల్గా, 3 కళాశాలల్లో నేలకొండపల్లి కళాశాలను బెస్ట్ కళాశాలగా తీర్చిదిద్దుతామన్నారు. విద్య పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్య లేకపోతే వెనుకబాటుతనమేనని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి 85 రోజుల్లోనే 28 వేల ఉద్యోగాల నియామకం చేశామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో టీఎస్ పిఎస్సిని ప్రక్షాళన చేశామని, క్వాలిటీ టీమ్ తో ఏర్పాటు చేసి, కొన్ని వేల ఉద్యోగాలకు గ్రూప్ 1, 2, 3, 4 ల క్రింద నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. మెగా డిఎస్సి ని ప్రకటించి, 11062 ఉద్యోగాల నియామకం చేయనున్నట్లు మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బలోపేతం చేసి, ప్రయివేటు విద్యాసంస్థలను మరిపించేలా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ చేయనుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి డా. సౌందర్య జోసెఫ్, కళాశాల ప్రిన్సిపాల్ డా. పరంజ్యోతి, విద్యాశాఖ ఇఇ నాగేషు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, నేలకొండపల్లి ఎంపిపి వజ్జ రమ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లహరి ఏసీ బస్సులను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి మార్చ్ 5 ప్రజా జ్యోతి.**
ఖమ్మం నూతన కలెక్టరేట్ నందు మంగళవారం నాలుగు నూతన లహరి బస్సులను వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, మరియు చేనేతవస్త్రాల శాఖ మంత్రివర్యులు గౌరవ.శ్రీ.తుమ్మల నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం 20 బెర్త్ లు మరియు 22 సీట్లతో కూడిన బస్సుల్లో అత్యాధునిక సదుపాయాలతో, సౌకర్యవం తమైన ప్రయాణ అనుభవాన్ని ప్రయాణీకులకు అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని గౌరవ. మంత్రిగారు శ్రీ. తుమ్మల నాగేశ్వర రావు తెలియజేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ. వి. పి. గౌతమ్ రిబ్బన్ ను కట్ చేసి, లహరి బస్సులను ప్రారంభిం చారు. సురక్షితమైన, సుఖవంతమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ప్రయాణికులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ శ్రీ.వెంకన్న గారు విజ్ఞప్తి చేశారు.

**లహరి బస్సులలో అందించబడే సదుపాయాలు:**

1. సౌకర్యవంతమైన సీటింగ్




2. వెహికల్ ట్రాకింగ్ సిస్టం,
3. ఫైర్ డిటక్షన్ %ఎ%అలారం సిస్టమ్
4. సిసి కెమెరా ,
5. స్పీకర్ అనౌన్స్మెంట్,
6. వైఫై ఫెసిలిటీ,
7. మొబైల్ ఛార్జింగ్ ఫెసిలిటీ, వాటర్ బాటిల్ హోల్డర్స్ కలవు.

ఈ బస్సులు ఖమ్మం నుండి బెంగళూరు వరకు నడపబడుతున్నవి. బెర్త్ %=ం% 2690/- మరియు సీట్ %=ం 1870/-

**చార్జి వివరాలు:**
ఖమ్మం నుండి హైదరాబాదుకు:
బెర్త్ %=ం 770/-ఒ% సీట్=.560/-గా చార్జ్ చేయబడుతున్నది.
ఈ కార్యక్రమం లో డిప్యూటీ రీజనల్ మేనేజర్( మెకానికల్) శ్రీ. భవానీ ప్రసాద్ గారు,ఖమ్మం మరియు మణుగూరు డిపో మేనేజర్లు ,ఆర్టీసీ సిబ్బంది మరియు కలెక్టరేట్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలి : జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 5 ప్రజా జ్యోతి**
అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముదిగొండ తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల ఆకస్మిక తనిఖీ చేసి, ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తుల క్షేత్ర పరిశీలన పారదర్శకంగా చేయాలన్నారు. ఆమోదయోగ్యంగా ఉన్న ప్రతి దరఖాస్తును ఆమోదించి, న్యాయం చేయాలన్నారు. తిరస్కరణ కు గురయిన దరఖాస్తు కు తగు కారణం పొందుపర్చాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారందరూ ప్రయోజనం పొందేలా, అన్ని ఎంపిడివో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేక పోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులో సరైన వివరాలు నమోదు చేయని వారికోసం ప్రజాపాలన కేంద్రాలని, పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు పనిచేస్తాయన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా ముదిగొండ తహసీల్దార్ వై. రామారావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- క్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు -బోనకల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీఐ మధు**

**బోనకల్,మార్చి 05,(ప్రజాజ్యోతి):**
మండల కేంద్రంలోని బోనకల్ పోలీస్ స్టేషన్ ను మంగళవారం మధిర సీఐ మధు సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించారు. అంతకుముందు సీఐ మధుకు ఎస్సై కే మధుబాబు మొక్కను అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.మండలంలో గల 22 గ్రామాల యొక్క భౌగోళిక స్థితిగతులను అడిగి తెలుసుకుని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సై కడగండ్ల మధుబాబుకు సూచించారు.మండలంలో ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు లేకుండా ఇసుక,మట్టి అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.100 డయల్ కేసుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో యువత చెడు వ్యసనాలకు బానిసవ్వకుండా




అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మండల కేంద్రంలో ప్రధాన కూడళ్ళు,గ్రామాల్లో సీసీ కెమెరాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**ఖమ్మం ప్రతినిధి మార్చి 5 ప్రజాజ్యోతి**
వైద్యులు అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. పేదవారికి మంచి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పేదవానికి భరోసా ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని అన్నారు. అర్ధరాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉంటారని, వైద్యం అందుతుందనే భరోసా ప్రజలకు ఇవ్వాలని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అభయహస్తం క్రింద ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఇప్పటికే 4 గ్యారంటీలు ప్రజల గుమ్మంకు చేర్చామన్నారు. ఈ నెల 11న భద్రాచలం శ్రీరాముల వారి సన్నిధిలో 5వ గ్యారంటీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన ప్రతి మాటను తూ.చ. తప్పకుండా ప్రజలకు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఎస్డీపివో నీలోహన, ఖమ్మం రూరల్ ఎంపిపి బెల్లం ఉమ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాజ్యోతి, మార్చి 5 - ఏన్కూర్**
మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామంలో ఆటో డ్రైవర్ కుటుంబానికి మంగళవారం ఆటో యూనియన్ చేయూతనిచ్చింది. ఆ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రఘురాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమ తోటి స్నేహితుడు మృతి చెందడంతో ఆటో యూనియన్ సభ్యులు మృతుడి కుటుంబానికి పదివేల రూపాయలతో, పాటు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**కారేపల్లి, మార్చి 5, ప్రజా జ్యోతి:**
సింగరేణి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన బానోత్ రామదాసు మనవరాలు బానోత్ దక్షిత అన్న ప్రసన్న వేడుకలు మంగళవారం ఇల్లందు మండల పరిధిలోని బొజ్జాయిగూడెం సమ్మక్క సారక్క గద్దెల వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, ఎస్టీ సెల్ మేదరి వీర ప్రతాప్ (టోని) నాయకులు భీముడు నాయక్, సంత చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, యువ నాయకుడు నవీన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సీనియర్ నాయకులు బాబు రామ్, చందర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పై బదిలీ అవుతున్న సీనియర్ సెక్యూరిటీ అధికారికి సన్మానం



**సత్తుపల్లి,మార్చి 6: (ప్రజాజ్యోతి)**
కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహించి మణుగూరు మైన్ మేనేజర్ గా పదోన్నతి పొంది ఈరోజు బదిలీ అవుతున్న రమణారెడ్డిని సత్తుపల్లి జే.వి.ఆర్ ఓ.సి సెక్యూరిటీ డిపార్ట్మెంట్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆజాముద్దీన్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. బదిలీపై వెళ్లిన చోట పనిలో నైపుణ్యత కనపరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రమణారెడ్డి స్థానంలో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన శంకర్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జమేదార్ శ్రీనివాసరావు, మల్లేష్, రామదాస్, సీనియర్ సెక్యూరిటీ రవీందర్ రెడ్డి, జోసెఫ్, కనకయ్య, కుమార్, సురా సురేష్, పెరుగు రాంబాబు, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్స్ కొక్కిర గడ్డ నగేష్, పాలకుర్తి సుందర్ రావు, గుర్రం రామకృష్ణ తదితర సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన సామాన్యుడు - గోసు ప్రసాద్

పెనుబల్లి, మార్చి 05(ప్రజాజ్యోతి):



తెలంగాణ ప్రభుత్వం తాజాగా గురుకుల ఉపాధ్యాయుల ఫలితాలు ప్రకటించింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన గోసు నాగేశ్వరరావు భూలక్ష్మి ల కుమారుడు గోసు ప్రసాద్ గురుకుల ఉపాధ్యాయుల ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి సరైన విద్యావకాశాలు లేకపోవడంతో, చదువుపై మక్కువతో కాకతీయ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో పీజీ విద్యను అభ్యసిస్తూ ఒకవైపు కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ మరోవైపు ప్రభుత్వం ఉద్యోగానికి అడుగులు వేయడం జరిగింది. దాదాపు 300 ఏళ్ల చరిత్ర కలిగిన పాత కుప్పెనకుంట్ల గ్రామం నుంచి ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టిన తొలి వ్యక్తి గోసుప్రసాద్. ఈ ఘనత సాధించి నందుకు గ్రామస్తులంతా ప్రసాద్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఖమ్మం ఎంపీ స్థానాన్ని మల్లు నందినికి కేటాయించాలి



ప్రజాజ్యోతి - ఏన్కూరు.

ఖమ్మం లోక్ సభ స్థానాన్ని మల్లు నందిని విక్రమార్క కు కేటాయించాలని వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్ అన్నారు. మంగళవారం ఏన్కూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర లాంటి పోరాటాలు చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ యాత్ర కొనసాగిస్తున్నాడు. దీంతో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో ఎంపీ స్థానాలు గెలిచి కేంద్రంలో ప్రజారంజక పాలనను ఏర్పాటు చేస్తుందన్నారు .కాంగ్రెస్ పార్టీ తెలంగాణ లో అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ ఏవిదంగా పనిచేసిందో రేపు జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో కూడా అదే విధంగా పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యండ్రాతి సాయి రోహిత్, నాయకులు పంతగాని నరేష్, తంబళ్ళ సామెలు, రేపల్లెవాడ మాజీ సర్పంచ్ మాలోత్ నరసింహరావు, బదావత్ వెంకట్, బందేల సాగర్, అజ్జు, తోటకూర వీరబాబు, బత్తుల సాయి పాల్గొన్నారు.

## గ్రామాల్లో మద్యం దుకాణాలను రద్దు చేయాలి

ప్రజాజ్యోతి, మార్చి 5 - ఏన్కూర్



గ్రామాల్లో వెంటనే బెల్ట్ షాపులను రద్దు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏన్కూర్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావే శంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్ట్ షాపులు లేకుండా చేస్తామన్న హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వైన్ షాపులను రాత్రి 8 గంటలకే బంద్ చేస్తున్నారని, దీనిపై ఎక్సైజ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. అధికారులు స్పందించి గ్రామాల్లో జరిగే అక్రమ మద్యం దందాలను అరికట్టాలన్నారు. బెల్ట్ షాపుల రద్దు కోసం ఉద్యమిస్తామని, అవసరమైతే అక్రమ మద్యం దుకాణాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మాదినేని వెంకన్న పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో భారీ చెట్లు నరికివేత

**- ఆ నరికిన కొమ్మ దుంగలు వంట చెరకుగా వినియోగం - పచ్చదనానికి తూట్లు - అపరిశుభ్రంగా పాఠశాల**

**- పట్టింపు కరువు ,పర్యవేక్షణా లోపం - నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం**






**కారేపల్లి, మార్చి 5 ప్రజాజ్యోతి:** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, వృక్షో రక్షితి రక్షితః అని ప్రభుత్వం పచ్చదనం, పరిశు భ్రత కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి, అడవులను పెంచి పోషించా లని, పర్యావరణాన్ని పరిరక్షించాలని, భావితరాలకు సైతం అందరికీ పరిశుభ్రమైన స్వచ్ఛమైన గాలిని అందించాలనే లక్ష్యంతో హరితహారం మొక్కలు నాటుతుంటే, ఆశ్రమ పాఠశాలలో మాత్రం ఏళ్ల తరబడి తాతలు నాటిన మహా వృక్షాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్ కలసి నరికించి, సదరు చెట్టుకొమ్మల దుంగలను వంట చెరుకుగా వినియోగిస్తు న్నారు. వివరాలలోకి వెళితే.. కారేపల్లి మండలం మారుమూల ప్రాంతమైన రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో గత కొంతకాలంగా పాఠశాల ఆవరణలోని మహావృక్షాలను నరికించి, ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులచే ఆ చెట్టు కొమ్మలను వంటగది వద్దకు మోపించి, ఆ దుంగలను వంట చెరుకుగా వినియోగిస్తున్నారని పాఠశాల విద్యార్థులే చెప్పడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వంటకు చెరకు వినియోగించకుండా గ్యాస్ వినియోగించాలని నిబంధన ఉన్నా, ఆ నిబంధనను తుంగలో తొక్కి, వంటకు చెరకు వినియోగిస్తుండడంతో పక్కనే ఉన్న గదిలో పొగకు విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మండల కేంద్రానికి పాఠశాల దూరంగా ఉండడం, అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో అక్కడ ఏం జరుగుతుందో బయట ప్రపంచానికి తెలిసే అవకాశంలేదు. ఇది ఇలా ఉండగా ఆశ్రమ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు బోర్ నీటిని ఆశ్రయిస్తున్నారు. తోటి ఉపాధ్యాయుల తీర్మానం లేకుండా, అధికారుల అనుమతి తీసుకోకుండా విద్యార్థులకు ఆహ్లాదకరమైన నీడనిచ్చే ఆవరణలో ఉన్న ఏళ్ల నాటి చెట్లను నరకడం ఎంతవరకు సబబని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, పాఠశాలను సందర్శించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆశ్రమ పాఠశాలలో శుచి ,శుభ్రత పూర్తిగా లోపించాయి. టాయిలెట్స్ అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. టాయిలెట్స్ పక్కనే భోజనశాల ఉండడం, విద్యార్థులు బస చేసే గదులు సైతం శుభ్రత లోపించడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎంతో ఉంది. అధికారుల పర్యవేక్షణలోపమే అన్ని సమస్యలకు మూల కారణంగా ఈ పాఠశాల దర్శనమిస్తోంది. విద్యార్థులు పడుకునే బల్లాలు సైతం సరిగా లేకపోవడం తో డైనింగ్ బల్లాలపై పడుకునే దుస్థితి ఏర్పడింది. వీటిపై ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరే ప్రయత్నం చేయగా, ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మంగళవారం హెడ్మాస్టర్ సెలవు పెట్టినా.. ఇన్చార్జి బాధ్యులను నియమించకపోవడం అంటే వీరి నిర్లక్ష్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయమై వార్డెన్ ను సైతం వివరణ కోరడానికి ప్రయత్నించగా.. ఆయన సైతం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. ఏది ఏమైనా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, పేద విద్యార్థులకు ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో పాఠశాలల భవనాలు నిర్మించి, సౌకర్యాలు కల్పిస్తున్నా, ఇలాంటి వారి అలాంటి పనుల వల్ల, ఆ ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పడి, నీరుగారుతున్నాయనే చెప్పొచ్చు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు అన్ని రకాలుగా విచారణలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకొని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# నామాను అధిక మెజార్టీతో గెలిపించాలి

**- ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం పట్ల హర్షం**

**- కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీపీ, పార్టీ నేతలు**



**కారేపల్లి, మార్చి5, ప్రజాజ్యోతి:** బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అధిక మెజార్టీతో కార్యకర్తలు, ప్రజలు గెలిపించాలని సింగరేణి మండల ఎంపీపీ మాలోతు శకుంతల, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమా శంకర్ లు అన్నారు.మంగళవారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో వారు విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును బి ఆర్ఎస్ పార్టీ ఖమ్మం అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మండల బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలసి హర్షం వ్యక్తం చేశారు.మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని మరింత అభివృద్ధి చెందాలంటే నామాను అధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ వాదాన్ని పార్లమెంట్లో వినిపించేందుకు బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులను విజయ పదాన నడిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు.బిఆర్ఎస్ అధినేత సారధ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించారన్నారు.24 గంటల విద్యుత్ తో పాటు రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రైతుబంధు,రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి వాటి ఫలాలను అందించారు.సింగరేణి మండలంలో వివిధ అభివృద్ధి పనులకు గాను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు తన ఎంపీ ల్యాడ్ నిధుల నుండి 40 లక్షల రూపాయల కేటాయించారని ఎంపీపీ తెలిపారు.ఈ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ముత్యాల సత్యనారాయణ,బత్తుల శ్రీనివాసరావు,మాలోతు కిషోర్,ఎండి హనీఫ్,మర్సకట్ల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.